క్లుప్తంగా

మానవత్వం చాటుకున్న ఉపాధ్యాయురాలు



మతిస్థిమితం లేని మహిళను చేరదీసిన ఉపాధ్యాయురాలు శశికళ

కళ్యాణదుర్గం రూరల్: ప్రభుత్వ ఉపాధ్యాయురాలు శశికళ మతిస్థిమితం లేని మహిళను చేరదీసి మానవత్వం చాటుకున్నారు. పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో సమీపంలో మతిస్థిమితం లేని మహిళ స్థానిక పరిసర ప్రాంతాల్లో తిరుగుతూ, అక్కడే తలదాచుకుంటోంది. ఆమెను ఎవరూ పట్టించుకోలేదు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న ప్రభుత్వ ఉపాధ్యాయురాలు శశికళ పట్టణ పోలీసులసాయంతో మతి స్థిమతం లేని మహిళను చేరదీశారు. అనంతపురంలోని ఆశ్రయ అనాథాశ్రమానికి తరలించారు. అక్కడ నుంచి చికిత్స కోసం కడప జిల్లాకు తీసుకెళ్లనున్నారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న పట్టణ సీఐ యువరాజు, పక్కన రూరల్ సీఐ వంశీకృష్ణ

కళ్యాణదుర్గం: పోలీసులు కూడా ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని డీఎస్పీ రవిబాబు సూచించారు. పట్టణంలోని స్థానిక ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయంలో డీఎస్పీ రవిబాబు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందికి శుక్రవారం వైద్య పరీక్షలు చేశారు. కళ్యాణదుర్గం సబ్ డివిజన్ పరిధిలోని పోలీసులకు వైద్య పరీక్షలు చేశారు. డీఎస్పీ రవిబాబు మాట్లాడుతూ ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ తరచుగా వైద్య పరీక్షలు చేయించుకొని ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సీఐలు యువరాజు, వంశీకృష్ణతో పాటు డివిజన్‌లోని ఎస్‌ఐలు, సుమారు 250 మంది పోలీసు సిబ్బంది హాజరయ్యారు.

ఉన్నత లక్ష్యంతో చదవాలి

వజ్రకరూరు: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలని హెచ్‌ఎం వేణుగోపాల్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని గూళ్యపాళ్యం ప్రాథమిక పాఠశాలను స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల ప్రగతిపై ఆరా తీశారు. అనంతరం కొనకొండ్ల ప్రాథమిక పాఠశాలలను కూడా సందర్శించి, విద్యార్థులతో మాట్లాడారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం



మాట్లాడుతున్న సర్పంచు మల్లెల జగదీష్ తదితరులు

వజ్రకరూరు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని సర్పంచు మల్లెల జగదీష్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చాబాల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బాల్యవివాహాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో సర్పంచు మాట్లాడుతూ ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతుంటే అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. హెచ్‌ఎం వెంకటేశులు, మహిళా పోలీస్ అరుణ, అంగన్‌వాడీ కార్యకర్తలు చంద్రమణి, సోమేశ్వరి, సరోజ, శశికళ, ఆయాలు వరలక్ష్మి, రాజేశ్వరి, నాగమ్మ, ప్రభావతి, కిశోరబాలికలు, బాలిక తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగికి గాయాలు

వజ్రకరూరు: మండల పరిధిలోని పీసీ ప్యాపిలి గ్రామ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో ఆర్టీసీ ఉద్యోగి సతీష్‌కు గాయాలయ్యాయి. ఎస్‌ఐ నాగస్వామి తెలిపిన మేరకు.. రాయదుర్గం డిపోకు చెందిన ఆర్టీసీ ఉద్యోగి సతీష్ ఉరవకొండ మీదుగా రాయదుర్గానికి కారులో బయల్దేరాడు. మార్గమధ్యలో పీసీ ప్యాపిలి సమీపంలో రోడ్డుకు అడ్డంగా జింక రావడంతో దాన్ని తప్పించే క్రమంలో పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సతీష్‌కు గాయాలయ్యాయి. స్థానికులు అతన్ని 108 వాహనంలో గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల ప్రతిభ



ఎన్‌సీసీ క్యాడెట్లను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, అధ్యాపకులు

రాయదుర్గంటౌన్: స్థానిక కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ విభాగానికి చెందిన ఆరుగురు విద్యార్థులు ఇంటర్ గ్రూపు పోటీల్లో పాల్గొని ఇద్దరు అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ తెలిపారు. ఇంటర్ గ్రూపు పోటీలకు అర్హత సాధించిన వంశీ, ఆసియాబానును ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు గురుమూర్తి, బాబు, జీసీవీ, ప్రసాద్ దొడ్డ నాగప్ప, దేవదాస్, విజయకుమార్, వినోద్‌కుమార్, రికార్డు అసిస్టెంట్ అస్లాం, క్యాడెట్లు పాల్గొన్నారు. క్యాడెట్లు పాల్గొన్నారు.

అస్తవ్యస్తం ..అంతరాయం

- ప్రధాన రహదారులపైనే వాహనాల పార్కింగ్
- పార్కింగ్ స్థలాల ఆక్రమణతో తప్పని అవస్థలు
- ప్రయాణికులు, పాదచారులకు ఇక్కట్లు



కళ్యాణదుర్గం టీ సర్కిల్ నుంచి గాంధీచౌక్ వెళ్లే ప్రధాన రహదారిలో ఫుట్‌పాత్‌ను ఆక్రమించి వాహనాలు నిలిపిన దృశ్యం



బళ్లారి రోడ్డులో ఇలా..



అనంతపురం రోడ్డులో సిటీ కేఫ్ వద్ద రోడ్డుకు అడ్డంగా నిలిపిన వాహనాలు

కళ్యాణదుర్గం: పట్టణంలోని ప్రధాన రహదారులకు ఇరువైపులా పార్కింగ్ స్థలాలు ఆక్రమణకు గురయ్యాయి. దీంతో వాహనదారులు, ప్రజలు అవస్థలు పడాల్సి వస్తోంది. టీ సర్కిల్ నుంచి కంబదూరు, అనంతపురం, రాయదుర్గం వైపు వెళ్లే రహదారులు, ఫుట్‌పాత్‌లు ఆక్రమించుకోవడంతో కనీసం పాదచారులు నడవడానికి కూడా వీల్లేకుండా పోయింది. చిరువ్యాపారులు, బడ్డీకొట్లు, తోపుడుబండ్ల వ్యాపారులు కూడా రోడ్లు ఆక్రమించడంతో పాదచారులు రాకపోకలు సాగించడానికి, లగేజీ తీసుకెళ్లడానికి కూడా ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

కళ్యాణదుర్గం పట్టణంలోని టీ సర్కిల్ ప్రాంతం నుంచి అనంతపురం ప్రధాన రహదారి ఇలాహి హోటల్ వరకు ఇరు వైపులా రహదారిలో పార్కింగ్ స్థలాలను దుకాణ దారులు ఆక్రమించారు. టీ సర్కిల్ నుంచి కంబదూరు వైపు వెళ్లే దారిలో డ్రైనేజీ పనులు జరుగుతుండటంతో ట్రాఫిక్ సమస్య జఠిలమైంది. రోడ్డు రిపేరీలో ఉండటం, పార్కింగ్, ఫుట్‌పాత్ స్థలాలను దుకాణదారులు ఆక్రమించారు. రాయదుర్గం వైపు వెళ్లే ప్రధాన రహదారిలో టీ సర్కిల్ నుంచి బళ్లారి మిట్ట వరకు రోడ్డుకిరువైపులా వాహనాలు అడ్డదిడ్డంగా దుకాణాల వద్ద నిలుపుతున్నారు. సమీపంలోని పాత మార్కెట్ సమీపంలో వాహనాలను నిలిపేందుకు అవకాశం ఉన్నా వాహనదారులు రోడ్డుపైనే ఇష్టారాజ్యంగా వదిలేస్తున్నారు. టీ సర్కిల్‌లో పలుమార్లు ప్రమాదాలు జరిగినా పార్కింగ్ విషయంలో అధికారులు పట్టించుకోలేదన్న విమర్శలు ఉన్నాయి.

ఎక్కడపడితే అక్కడ పార్కింగ్



ముఖ్యంగా టీ సర్కిల్ నుంచి గాంధీ చౌక్, టీ సర్కిల్ నుంచి ఇలాహి హోటల్, టీ సర్కిల్ నుంచి బళ్లారి మిట్ట, గాంధీ చౌక్ నుంచి కోటవీధి వరకు ప్రధాన రహదారులపైనే అడ్డంగా వాహనాలను పార్కింగ్ చేయడంతో ఇబ్బందిగా ఉంటోంది. ఒక్కోసారి వాహనాలు కూడా రోడ్డుపైనే నిలిచిపోతున్నాయి. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

– షేక్షావలి, స్థానికుడు, కళ్యాణదుర్గం

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



టీ సర్కిల్ నుంచి వాల్మీకి సర్కిల్‌కు రావాలంటే కష్టమవుతోంది. ఇరువైపులా ఉన్న దుకాణాల వద్ద ద్విచక్ర వాహనాలు అడ్డదిడ్డంగా నిలుపుతుండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. రోడ్డు విస్తరణ చేసినా పూర్తి స్థాయిలో డ్రైనేజీ నిర్మాణం కాకపోవడంతో ఫుట్‌పాత్ స్థలంలోనే బైకులను నిలుపుతున్నారు.

– చరణ్, స్థానికుడు, కళ్యాణదుర్గం

చర్యలు తీసుకుంటాం



కళ్యాణదుర్గంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. ఇన్నాళ్లు పాతబస్టాండ్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో అండర్ డ్రైనేజీ పనులు జరుగుతుండడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ప్రస్తుతం పనులు పూర్తవుతున్నాయి. త్వరలోనే వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటాం. దుకాణాల వద్ద వాహనాలు నిల్వ లేకుండా నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేసి, పాత మార్కెట్ స్థలంలో వాహనాలు పార్కింగ్ చేసేలా చర్యలు తీసుకుంటాం.

– యువరాజు, సీఐ, కళ్యాణదుర్గం అర్బన్

ఆర్డీటీపై కక్ష సాధింపు ధోరణి తగదు



జల్లిపల్లిలో పోస్టుకార్డులను చూపుతున్న విద్యార్థులు



కుందుర్పి జెడ్పీ పాఠశాలలో ఆర్డీటీ పరిరక్షణ కోసం పోస్టు కార్డుల ఉద్యమాన్ని చేపట్టిన దృశ్యం

కూడేరు: పేద ప్రజలకు ఎంతో సేవ చేస్తున్న ఆర్డీటీపై కక్ష సాధింపు చర్యలు తగవని జల్లిపల్లి, కొర్రకోడు హైస్కూల్ విద్యార్థులు వేడుకున్నారు. శుక్రవారం జల్లిపల్లి, కొర్రకోడు హైస్కూల్ విద్యార్థులు ఆర్డీటీని కాపాడుకుందామంటూ ఆర్డీటీ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పోస్టుకార్డు ఉద్యమం చేశారు. సుమారు 200 మంది విద్యార్థులు ఆర్డీటీని కాపాడాలని అంటూ పోస్టుకార్డులను హోంమంత్రి అమిత్‌షాకు రాసి పంపారు. కార్యక్రమంలో ఆర్డీటీ పరిరక్షణ సమితి సభ్యులు సంజీవరాయుడు, రమణ, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

కుందుర్పి: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యయులు, విద్యార్థులతో పోస్టుకార్డు ఉద్యమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఆర్డీటీని పరిరక్షించాలని ఆర్డీటీ పూర్వ విద్యార్థి డీఎం నరసింహమూర్తి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు. నరసింహమూర్తి మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి ఆర్డీటీ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందన్నారు. అలాంటి సంస్థను కేంద్రం అడ్డుకోవడం దారుణమన్నారు. అనంతరం విద్యార్థులతో పీఎం మోదీ, కేంద్రమంత్రులు, సీఎం చంద్రబాబుకు పోస్టుకార్డులు రాయించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు లోకేష్, అప్పా ఆంజనేయులు, నాగభూషణం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శెట్టూరు: ఆర్డీటీని పరిరక్షించాలని మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు శుక్రవారం పోస్టుకార్డుల ఉద్యమం చేపట్టారు. వందలాది మంది విద్యార్థులు పోస్టుకార్డుల్లో ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలని కేంద్రహోం మంత్రి అమిత్‌షాకు ఉత్తరాలు రాశారు. కార్యక్రమంలో సర్పంచ్ కుమార్, వైస్ ఎంపీపీ చెవుల కిష్టప్ప, విద్యార్థులు, ఆర్డీటీ సీబీటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో గందరగోళం



ఉత్తర్వుల కోసం అధికారులతో వాగ్వాదం చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

కళ్యాణదుర్గం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో చేపట్టిన సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో గందరగోళం నెలకొంది. శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్లు, సర్వేయర్లు, ఏఎన్‌ఎంలు 30 మందికి స్థానాలు కేటాయించి, విధుల్లో చేరాలని ఉత్తర్వులు ఇచ్చారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివశంకర్ 15వ తేదీకి బదులుగా ఈనెల 18న విధుల్లో చేరినట్లు ఉత్తర్వులు ఇస్తామని తెలపడంతో గందరగోళం నెలకొంది. మూడు రోజుల పనిదినాలు కోల్పోవాల్సి వస్తుందని ఉద్యోగులు అన్నారు. ఈనెల 15నే కార్యాలయానికి వచ్చామని, అధికారులు విధుల్లోకి చేర్చుకోలేదని తెలపడంతో కొద్దిసేపు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ, సచివాలయ ఉద్యోగుల మధ్య వాగ్వాదం జరిగింది. ఎంపీడీఓ సెలవుపై వెళ్లడంతోనే సమస్య తలెత్తిందని ఉద్యోగులు వాపోయారు. ఎట్టకేలకు ఉద్యోగులు రిలీవ్ అయిన తేదీల్లో అధికారులు ఉత్తర్వులు అందించారు.

నకిలీ ఇళ్ల పట్టాల ముఠాపై చర్యలేవీ?

- కలెక్టర్ ఆదేశించినా పట్టించుకోని అధికారులు
- కొనసాగుతున్న నకిలీ పట్టాల వ్యవహారం
- పేదల కాలనీల్లో ఆగని దళారుల దందా

రాయదుర్గం: పట్టణంలోని గౌడ, బీటీపీ, మల్లాపురం లేఔట్లలో వెలుగుచూసిన నకిలీ ఇళ్ల పట్టాల బాగోతంపై అధికారులు ఎలాంటి చర్యలూ చేపట్టలేదు. బోగస్ ఇళ్లపట్టాల వ్యవహారంపై పత్రికల్లో వరుస కథనాలు ప్రచురితం కావడంతో జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబు ఇటీవల లేఔట్లపై విచారణ చేశారు. నకిలీ పట్టాలను ఏరివేసి అర్హులకు న్యాయం చేయాలని తహసీల్దార్ నాగరాజు, రెవెన్యూ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఇదే క్రమంలో తహసీల్దార్ సంతకాలతో నకిలీ పట్టాలు సృష్టించి, భూమి మార్పిడి చేసిన ముఠాను గుర్తించాలని ఆదేశించారు. అయితే అధికారులు చర్యలు చేపట్టడంలో మీనమేషాలు లెక్కిస్తుండడం అనుమానాలకు తావిస్తోంది. నకిలీ పట్టాలు పొందిన లబ్ధిదారులు కార్యాలయాల వద్దకు వచ్చి గోడు వెళ్లబోసుకుంటున్నా తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తుండడంపై విమర్శలకు దారి తీస్తోంది. ఇప్పటికే అధికారులు అర్హులను గుర్తించి నోటీసులను జారీ చేశారు. క్రమ సంఖ్య వారీగా ఖాళీ స్థలాలు, పునాదులకు నోటీసులు అతికించారు. గడువులోపు నిర్మాణాలు చేపట్టకపోతే స్వాధీనం చేసుకుని అర్హులకు ఇవ్వాల్సి వస్తుందని హెచ్చరించారు.

నకిలీ పట్టాల ముఠా చేతిలో మోసపోయిన పేదలు

రాయదుర్గం పట్టణం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోంది. పట్టణ వైశాల్యం కూడా పెరుగుతోంది. గ్రామీణ ప్రాంతాలు వీడి ప్రజలు పట్టణాల్లో స్థిరపడే వారి సంఖ్య ఎక్కువైంది. అలాంటి వారిని గుర్తించి నకిలీ పట్టాల ముఠా జోరుగా వ్యాపారం చేసింది. ఓ అధికారి సహకారంతో ఇష్టారాజ్యంగా నకిలీ పట్టాలు సృష్టించి పేదలను దగా చేశారు. ఒక్కో పట్టా రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షలు, పునాదులయితే రూ.2.50 నుంచి రూ.4 లక్షల వరకు విక్రయించారు. అధికారుల నోటీసుల జారీతో నకిలీ పట్టాదారులంతా లబోదిబోమంటున్నారు.

సామాజిక కార్యకర్త ఫిర్యాదు

నకిలీ పట్టాల కుంభకోణంలో సూత్రదారులపై చర్యలు చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని ఓ సామాజిక కార్యకర్త జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ విచారణకు ఆదేశించారు. నకిలీ పట్టాల బాగోతాన్ని వెలికితీసి పేదలందరికీ న్యాయం చేయాలని ఇటీవల మున్సిపల్ కౌన్సిల్‌లోనూ సభ్యులు నిలదీశారు. విచారణను వేగవంతం చేసి బాధ్యులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

డిమాండ్లు అంగీకరించేదాకా సమ్మె



రాయదుర్గం మానవహారంగా ఏర్పడిన కార్మికులు



కళ్యాణదుర్గంలో ధర్నా చేస్తున్న కార్మికులు

రాయదుర్గంటౌన్: డిమాండ్లు పరిష్కరించాలని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం ఆరోరోజుకు చేరుకుంది. స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట శిబిరం నుంచి వినాయక సర్కిల్ వరకు కార్మికులు ర్యాలీ చేశారు. అక్కడ మానవహారం ఏర్పాటు చేశారు. సీఐటీయూ జిల్లా సహాయక కార్యదర్శి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు తిప్పేరుద్ర మాట్లాడారు. డిమాండ్లు పరిష్కరించే వరకూ సమ్మె చేస్తామని హెచ్చరించారు.

కళ్యాణదుర్గం రూరల్: సమస్యలు పరిష్కరించేంత వరకే ధర్నా చేస్తామని మున్సిపల్ కార్మికుల యూనియన్ కార్యదర్శి వన్నూరస్వామి అన్నారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపాల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు ధర్నా చేశారు. కార్మికులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యల పరిష్కరిస్తామని చెప్పి, అధికారంలోకొచ్చిన తర్వాత పట్టించుకోవడంలేదన్నారు. వన్నూరుస్వామి, శివ, నటాజ్ దురుగమ్మ, శివయ్య, కార్మికులు పాల్గొన్నారు.

పోలీసులకు సన్మానం

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న హెడ్ కానిస్టేబుళ్లు బాల నరసింహులు, జనార్దన్‌ను శుక్రవారం సన్మానించారు. హెడ్ కానిస్టేబుళ్లను సన్మానించారు. హెడ్ కానిస్టేబుల్ బాల నరసింహులు పుట్టపర్తికి, జనార్దన్ ఉరవకొండకు బదిలీ అయ్యారు. ఎస్‌ఐ శివ అధ్యక్షతన సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ రామదాసు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్యారేజీ ఉద్యోగులతో అదనపు పనులపై విమర్శలు

ఉరవకొండ: ఉరవకొండ ఆర్టీసీ డిపో గ్యారేజీ విభాగంలో ఉద్యోగులతో డిపో మేనేజర్ హంపన్న బాత్‌రూంలకు పెయింటింగ్ చేయించడం, డిపో ఆవరణలో మురుగును శుభ్రం చేయించడం విమర్శలకు తావిస్తోంది. ఉరవకొండ ఆర్టీసీ డిపో ఆవరణలో బాత్‌రూంల వద్ద కార్యాలయాల్లో పెయింటింగ్ వేయించి,వారితోనే ఆవరణలో మురుగును శుభ్రం చేయించారు. గ్యారేజీ విధులు కాకుండా తమతో పెయింటింగ్, టాయిలెట్‌లు శుభ్రం చేయించడం సరికాదని ఉద్యోగులు అంటున్నారు. దీనిపై డిపో మేనేజర్‌ను అడగ్గా పెయింటింగ్, ఇతర పనులు సిబ్బందితో చేయిస్తే తప్పేంటి అని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



ఉరవకొండ ఆర్టీసీ డిపోలో గ్యారేజీ కార్మికులకు డెంగీపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఉరవకొండ: ఉరవకొండ ఆర్టీసీ డిపోలోని గ్యారేజీ విభాగంలో పనిచేసే కార్మికులు గ్యారేజీ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి బత్తుల కోదండరామిరెడ్డి తెలిపారు. శుక్రవారం ఉరవకొండ ఆర్టీసీ డిపో ఆవరణలో డీఎం హంపన్న అధ్యక్షతన డెంగీ మాసోత్సవాల సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ మాట్లాడారు. గ్యారేజీ కార్మికులు పౌష్టికాహారం తీసుకుంటూ ఎక్కువగా నీరు తాగాలన్నారు. దీంతో పాటు ఇండ్లలల్లో ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ సూపరింటెండెంట్ రమణమ్మ, ఎంపీహెచ్‌ఓ త్యాగరాజు, హెల్త్ సూపర్‌వైజర్ నిమ్మల వెంకటేష్, ప్రసాద్‌రావు, సుమలత, అర్చన, కుళ్లాయమ్మ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కణేకల్లులో రేపు ‘రీ కాలింగ్ మేనిఫెస్టో’

కణేకల్లు: కణేకల్లులోని చిక్కణ్ణేశ్వర ఫంక్షన్ హాలులో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ‘రీ కాలింగ్ మేనిఫెస్టో’ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మానందరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి హాజరవుతారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమానికి హాజరు కావాలని తెలిపారు.

ఛాయాపురంలో ఎంపీడీఓ పర్యటన

వజ్రకరూరు: ఛాయాపురం గ్రామంలో ఎంపీడీఓ శివాజీరెడ్డి శుక్రవారం పర్యటించారు. ఈసందర్భంగా గ్రామంలోని పలు కాలనీల్లో ఎంపీడీఓ పర్యటించి, చెత్తసేకరణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికీ వచ్చి చెత్త సేకరిస్తున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వం,అధి కారుల నుంచి అందుతున్న సేవలపైనా తెలుసుకున్నారు. ఎంపీడీఓ మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సర్పంచు కమలమ్మ, ఈఓఆర్డీ దామోదర్ రెడ్డి, గ్రామ కార్యదర్శి ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

ప్లాస్టిక్ వాడకంతో అనర్థాలపై అవగాహన

కళ్యాణదుర్గం రూరల్: ప్లాస్టిక్ వాడకంతో అనర్థాలపై అవగాహన అవసరమని మున్సిపల్ కమిషనర్ వంశీ తెలిపారు. శనివారం స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా బళ్లారి మిట్ట నుంచి టీసర్కిల్ వరకు ప్లాస్టిక్ కాలుష్యంపై అవగాహన కార్యక్రమం ఉంటుందని శుక్రవారం ఆయన కోరారు.

వీఓ లీడర్లతో సమావేశం

వజ్రకరూరు: స్థానిక స్త్రీశక్తి భవనంలో శుక్రవారం వీఓ లీడర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామ శ్రేయస్సు స్థితిస్థాపక ప్రణాళికపై శిక్షణ ఇచ్చారు. ఏపీఎం లలిత మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు అవసరమైన సేవలను కార్యక్రమం ద్వారా పొందొచ్చన్నారు. ప్రభుత్వ పథకాలతోపాటు సామాజిక అంశాలను కూడా తెలుసుకోవచ్చని తెలిపారు. సమైక్య అధ్యక్షురాలు , కార్యదర్శులు, గ్రామ సంఘం లీడర్లు, సీసీలు పాల్గొన్నారు.

‘ఉపాధి’ కూలీల బిల్లుల మంజూరు

వజ్రకరూరు: మండలంలోఉపాధిహామీ కూలీల బిల్లులు మంజూరయినట్లు ఏపీఓ విమల తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆమె మాట్లాడారు. మండలంలో చేపట్టిన సీసీ రోడ్లు,డ్రెయినేజీలకు రూ.1.49 కోట్లు మంజూరయినట్లు తెలి పారు. సోక్‌పిట్స్, క్యాటిల్‌షెడ్స్, పశువుల తొట్టెలకు రూ. 21 లక్షలు మంజూరైనట్లు ఏపీఓ తెలిపారు.

నేడు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీ

రాయదుర్గంటౌన్: పట్టణంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈనెల 19న అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. కౌన్సిలర్లు, ప్రజా సంఘాలు, సచివాలయ ఉద్యోగులు, ప్రజలు హాజరుకావాలని కోరారు.

హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కళ్యాణదుర్గం రూరల్: హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సబ్‌డివిజన్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రాజేష్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఏఎస్‌డబ్ల్యూఓ కార్యాలయంలో హాస్టల్ వార్డెన్లతో సమావేశం నిర్వహించారు. డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ హాస్టళ్లలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు రాకుండా తలుపులు, కిటికీలకు మెష్ వాడాలని వార్డెన్లకు సూచించారు. ప్రతి నెలా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ప్రతి హాస్టల్‌లో ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో వార్డెన్‌లు నాగరాజు, సూరాంజనేయులు, జయలక్ష్మి, ఓబులమ్మ, రాధ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

కళ్యాణదుర్గం రూరల్: అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ నందిని (27) అనే వివాహిత శుక్రవారం మృతిచెందింది. మండలంలోని గరుడాపురం గ్రామానికి చెందిన నందిని కడుపునొప్పి తాళలేక గురువారం పురుగుల మందుతాగి ఆత్మహత్యయత్నం చేసింది. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక సీహెచ్‌సీ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శాకంబరి అలంకరణలో అమ్మవారు



శాకంబరి అమ్మవారు

కళ్యాణదుర్గం: పట్టణంలో వెలసిన వాసవీకన్యకాపరమేశ్వరి అమ్మవారు శాకంబరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం ఉదయం ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని నూటి ఇబ్బంద్రు ఆర్యవైశుల వంశస్తులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం 10 గంటలకు మహా మంగళహారతి, 10.30 గంటలకు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

శాకంబరీదేవిగా ఉరగాద్రి అమ్మవారు

ఉరవకొండ: స్థానిక ప్రసిద్ధిగాంచిన ఉరగాద్రి చౌడేశ్వరి అమ్మవారు శాకంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం ఉదయం అమ్మవారికి అభిషేకం, మహా మంగళహారతి, కుంకుమార్చన, దీక్షా హోమం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కొత్త శరత్ ఆధ్వర్యంలో అమ్మవారిని శాకంబరీగా అలంకరణ చేశారు.

24న చౌడేశ్వరీదేవి ఉత్సవాలు



పోస్టర్లను విడుదల చేస్తున్న కమిటీ సభ్యులు

ఉరవకొండ: ప్రసిద్ధిగాంచిన ఉరగాద్రి చౌడేశ్వరీ అమ్మవారి జయంత్యుత్సవాలు ఈనెల 24న వైభవంగా జరగనున్నట్లు ఆలయ చైర్మన్ కొత్త శరత్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఉత్సవాల పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ అమ్మవారి జయంతి సందర్భంగా పట్టణ వీధుల్లో అమ్మవారి పల్లకీ ఉత్సవం, అమ్మవారికి విశేష పూజలు నిర్వహిస్తామన్నారు. ఉచిత అన్నదాన కార్యక్రమం కూడా ఉంటాయన్నారు. కమిటీ సభ్యులు రెడ్డి ఆంజనేయులు, కొత్త భాస్కర్, లక్కాఎర్రిస్వామి, ఆర్‌సీ ప్రసాద్, ఉట్టి ధనంజయ, కొత్త సోమశేఖర్, నిమ్మల ప్రసాద్, చిట్టారఘు, రామన్న, కిశోర్, ఉట్టి నారా యణస్వామి ఆలయ అర్చకులు ప్రసాద్ పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

కణేకల్లు: పూలచెర్లలో ఎర్రిస్వామి అనే వ్యక్తిని తిప్పేస్వామి, అతని భార్య, కూతురు దాడి చేసినట్లు ఏఎస్‌ఐ శంకర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. టీ కొట్టు వద్ద నిల్చొన్న ఎర్రిస్వామిపై దాడి చేశారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.